తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026







## నేడు సీఎం చంద్రబాబు...
## హోసూరులో ప్రచారం



కుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం తమిళనాడులో పర్యటించనున్నారు. ఏప్రిల్ 23న తమిళనాడులో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్డీయే కూటమి అభ్యర్థులకు మద్దతుగా సిఎం చంద్రబాబు తమిళనాడులో పర్యటించి రోడ్‌షోలో, ప్రచార సభల్లో పాల్గొంటారు. సోమవారం ఉదయం ఉండవల్లి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో కోయంబత్తూరు చేరుకుంటారు. అక్కడ ఎన్నికల ప్రచారం అనంతరం కుప్పంకు సుమారు 70కి.మీ.ల దూరంలో ఉన్న హోసూరు, తళి ప్రాంతాల్లో పర్యటించి అక్కడ ప్రచారం చేస్తారు. అనంతరం రాత్రి ఆవడి, చెన్నైలో ప్రచారం చేపడతారు. కాగా ఈ ప్రాంతాల్లో తెలుగుప్రజలు అధికంగా ఉన్నారు. దీంతో సిఎం చంద్రబాబు అక్కడ ప్రచారం చేపట్టనున్నారు.

## కమిషనర్ గారు...
## కాస్త కన్నెత్తి చూడరూ!

**- యథేచ్ఛగా ఆక్రమణలు...పూడుకుపోతున్న డ్రైనేజీలు**

సూళ్లూరుపేట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త: స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర అంటూ ప్రభుత్వం ప్రతిష్టాకరంగా చేపడుతున్న కార్యక్రమానికి కొందరు తూట్లు పొడుస్తున్నారు. అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించడంతో యదేచ్ఛగా ఆక్రమలు చేసుకొని తమ పని అయింది అనిపించుకుంటున్నారు. ఖాళీ స్థలాలకే పరిమితమైన ఈ కబ్జాల పర్వం ప్రస్తుతం ప్రధాన రోడ్లుకి ఇరువైపులా కొనసాగుతుంది. సూళ్లూరుపేటలోని ప్రధాన వీధుల్లో డ్రైనేజీలు సైతం కబ్జా చేసి యథేచ్ఛగా దానిపైనే శాశ్వతంగా వ్యాపారులు చేసుకుంటూ దర్జాగా ఉన్నారు. జి ఎన్ టిరోడ్డుకే పరిమితమైన ఈ ఆక్రమణలు పట్టణంలోని పలు ప్రాంతాలలో నెలకొని ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యం రద్దీగా ఉండే రైల్వే గేట్‌కు వెళ్లే ప్రధానమార్గమైన గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు రోజు రోజుకి ఆక్రమణతో కుచించుకుపోతుంది. రోడ్లపై తోపుడుబండ్ల పెట్టి వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు ఇదే అదునుగా చూసుకొని ఒకవైపు బండ్లతో పాటు మరోవైపు శాశ్వతంగా షెల్టర్లు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఇంతటితో ఆగకుండా పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువలో తాము ఉపయోగించిన వ్యర్థాలను వేసి కాలువలను పూర్తిగా పూడ్చివేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇతర శాఖలకు చెందిన అధికారులు, ప్రజలు ఈ మార్గంలో పయనిస్తున్నప్పుడు ఈ ఆక్రమణలతో పూడిపోయిన డ్రైనేజీ నుండి వచ్చే దుర్వాసనతోఇబ్బందులకు గురవుతున్నారు.స్వచ్ఛంద స్వర్ణాంధ్ర లక్ష్యం నెరవేరాలంటే కాలువలు పూడికకు గురి కాకుండా చర్యలు తీసుకొని పర్యావరణాన్ని కాపాడడంతో పాటు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయత్నిస్తే సమంజసంగా ఉంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయం సమూహానికి దగ్గరగా ఉన్న ఈ ప్రాంతంలో ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించవలసి ఉంటుంది. అలాగే జీఎన్టీ రోడ్లలోఆక్రమణలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఏకంగా డ్రైనేజీ కాలువల మీదే షెడ్లు వేసుకుని ఆ షెడ్లలో వ్యాపారాలు కొనసాగిస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. కొందరైతే రేకుల షెడ్లను వేసుకొని వాటి ద్వారా బాడుగలు తీసుకుంటూ తమ పని



పట్టణంలో ఆక్రమణల దృశ్యం

కానిస్తున్నారు. ఇవన్నీ బహిరంగ రహస్యమైన పట్టించుకునే నాధుడే కరువయ్యారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుంటే సమంజసంగా ఉంటుంది.







## మద్యం మత్తులో... కళ్యాణీ డ్యామ్‌లోకి దూకిన యువకుడు మృతి!

**-పుంగనూరు నుండి శ్రీమూలస్థానమ్మ ఎదుట సత్య ప్రమాణానికి రాక**

చంద్రగిరి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త: మద్యం మత్తులో కళ్యాణీ డ్యామ్‌లోకి దూకిన డ్రైవర్ మురళీమోహన్ (35) మృతి చెందాడు. వివరాల్లోకెళితే.. పుంగనూరుకు చెందిన ముగ్గురు డ్రైవర్లు సుబ్రమణ్యం, గంగరాజు, మురళీమోహన్ మద్యం మానేందుకు చంద్రగిరి శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో



ప్రమాణం చేయడానికి బయలుదేరారు. మార్గ మధ్యలో కళ్యాణీ డ్యామ్‌ను తిలకించేందుకు వెళ్ళారు. ఆ మేరకు ముగ్గురూ కలసి వెళుతుండగా మురళీమోహన్ అకస్మాత్తుగా డ్యామ్‌లోకి దూకేశాడు. దీంతో భయాందోళనకు గురైన సహచరులు అక్కడి నుండి పారిపోయి పుంగనూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పుంగనూరు పోలీసులు చంద్రగిరి సిఐ సురేష్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. సిఐ సురేష్‌కుమార్, ఎస్ఐ అరుణాచల ం తమ సిబ్బందితో డ్యామ్ వద్దకు చేరుకుని గజీతగాళ్ళతో మృతదేహం కొరకు గాలింపు చేపట్టారు. ఆదివారం మృతదేహం లభ్యం కాకపోవడంతో వెను దిరిగారు. మురళీమోహన్ మృతి పట్ల కేసు నమోదు చేసిన పోలీసులు మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.









# నేడు సిఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు



## - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్
## - సిఎం చిత్రపటానికి కృష్ణాజలాభిషేకం.. అన్నదానాలు !!
## - ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం.. 1500 బైక్‌లతో భారీ ర్యాలీ !!

కుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను సోమవారం కుప ్పంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఉదయం కుప్పం శ్రీరామలింగేశ్వరాలయంలో సిఎం పేరిట అభిషేకం నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్న క్యాంటీన్‌లో మూడుపూటల ఉచితంగా పేదలకు ఆహారం అందిస్తామన్నారు. అలాగే బస్టాండులో మహిళలచే కృష్ణా జలాలతో సిఎం చంద్రబాబు చిత్రపటానికి కృష్ణాజలాభిషేకం నిర్వహిస్తామన్నారు. కుప్పం బస్టాండ్‌లో దివ్యాంగులచే కేక్ కటింగ్ జరుగుతుందన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో స్విమ్స్ ఆస్పత్రిచే మహిళలకు ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, జనరల్ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కుప్పంలో సుమారు 100 ట్రాక్టర్ పల్లకీలు, 1500బైక్‌లు, ఇతర వాహనాలు, ఇ - సైకిళ్లతో ర్యాలీ, పార్టీ కార్యాలయం వద్ద కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో సిఎం పేరిట అభిషేకాలు, కేక్ కటింగ్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాలను తెదేపా కుటుంబసభ్యులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## చెంగల్ రెడ్డి ఎమ్మెల్యేని విమర్శించే స్థాయి నీదికాదు
### - టిడిపి నాయకులు

యర్రావారిపాలెం, ఏఫ్రిల్ 19, ప్రభాతవార్త



యర్రావారిపాలెం మండలంలో ఆదివారం టిడిపి నాయకులు మీడియాతో మాట్లాడుతూ టిడిపి మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బొమ్మల జగదీష్ మాట్లాడుతూ చెవిరెడ్డి మోహిత్ ఎమ్మెల్యే పిల్లబచ్చా అన్నాడని తెగవాగుడు వాగారు సుమారు 30 సంవత్సరాల నుండి గెలవని చంద్రగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగరేసిన ఘనత మా ఎమ్మెల్యేదని, ఎన్నికలు లేకుండా ఎంపిపి అయిన ఘనత మీది అని విమర్శించారు. అభివృద్ధి అంటే 4 వేలు రూపాయలకు బల్లలు చేయించి 12 వేలు బిల్లు పెట్టుకోవడం కాదని, తలకోన గుడికి 21 కోట్లు మంజూరు చేసిన ఘనత మా ఎమ్మెల్యేది అని విమర్శించారు. చిత్తూరుపార్లమెంట్ టిడిపి అధికారప్రతినిధి పులిచర్ల మహేష్ మాట్లాడుతూ ఎవరు దిగజారి మాట్లాడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు యర్రావారిపాలెం మండలంలో ఒక ఎర్రచందనం దొంగ ఉన్నాడు అతను ఎమ్మెల్యే గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవ చేశారు. అయ్యా చంగల్ రెడ్డి ఇప్పటికే జైలుకు వెళ్లి చిప్పకూడు తినివచ్చినా బుద్ధి రాలేదని ఇంకా పెండింగ్ కేసుల్లో డబ్బుతో మేనేజ్ చేసుకుని తిరుగుతున్నాడని త్వరలో మళ్లి చిప్పకూడు తింటాడని అధికారులు కూడా స్పందించి ఇలాంటి వారిపై ఉన్న పెండింగ్ కేసులు పరిష్కారిస్తే ప్రజలకు అధికారులపై నమ్మకం కలుగుతుంది అని తెలిపారు. ఇంకొక సారి మా ఎమ్మెల్యే పై నోరు పారేసుకుంటే మాత్రం పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయక్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయంలో దోచుకో దాచుకో అన్నట్లు పరిపాలన చేసారని ఉపాధి హామీలో కోట్లు దోచేశారుఅని అదే అభివృద్ధి అని తెలిపారు. అభివృద్ధి అంటే దోచుకోవడమే అని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఉపయోగపడే విదంగా పరిపాలన ఉండటం, అవినీతికి తావులేకుండా ఉండటంతో మంచిపేరు వచేస్తుంది అని వైసీపీ నాయకులు ఏడవటం మొదలుపెట్టారు. పులివర్తి నాని అంటే అభివృద్ధికి మారుపేరు అని తెలిపారు. మండల వైసీపీ నాయకులు చంగల్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోక పోతే తగిన మూల్యం చెల్లించుకుంటాడని హెచ్చరించారు. ఈ మీడియా సమా వేశంలోమార్కెట్‌యార్డ్‌డైరక్టర్‌కుంబా నాగరాజు, రైతు సంగం అధ్యక్షులు దానసి రమణయ్య పాల్గొన్నారు.

## శ్రీ మునీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నగరి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :



నగరి మునిసిపాలిటీ పరిధిలోని బస్టాండ్ వద్ద వెలసిన శ్రీ మునీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పట్టణ ప్రముఖులు దివంగత జ్యోతి అమ్మ సుందర్ మొదలియార్ కుటుంబ సభ్యులు వారి జ్ఞాపకార్థం చేసిన రూ. 4,25 లక్షల ఆర్థిక సాయంతో ఆలయంలో వంట శాల, స్టోర్ రూమ్, కార్యాలయ గదులన్నింటిలోనూ గ్రానైట్ రాళ్లను పరిచారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, సేవకులు వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి మునీశ్వరస్వామి ప్రసాదాలను అందజేశారు. అలాగే స్వామి మహావృక్షం చుట్టూ స్టీల్ గేట్ ఏర్పాటుకు స్థానిక భక్తులు రమాదేవి, బాబు సుమారు 60,000 వేలు వితరణ చేశారు. వేద పండితులు శ్రీ శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన విశేష పూజలు, అభిషేకాల్లో స్వామివారి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు కుంకుమ, విభూది, తీర్థ, ప్రసాదాలు అందించారు.

## దేవాలయ ప్రహరీ గోడకు రామిరెడ్డి ధ్వజారెడ్డి రూ.10 లక్షలు వితరణ

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త



రైల్వే కోడూరు మండలంలోని సూరపరాజు పల్లి పంచాయతీ పొట్టిరాజుగారిపల్లి గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ప్రజలు నిర్మించుకుంటున్న రాములవారి దేవాలయ ప్రహరీ గోడకు తన సొంత నిధులను 10 లక్షల రూపాయలు అందించినట్లు వైసిపి సీనియర్ నాయకులు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. ముఖ్యంగా రైల్వే కోడూరు మండలంలో దేవాలయాలకు, పాఠశాలల మరుగుదొడ్లకు, మాధవరం పోడు దేవాలయానికి 40 వేల రూపాయలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాల దృష్ట్యా పూర్తిస్థాయిలో అందరికీ సేవ చేయాలనే తపన తనకు ఉందని పదవి ఉన్న లేకున్నా ప్రజల అవసరాలలో పాలుపంచుకుంటానని ధ్వజారెడ్డి తెలియజేశారు. ప్రజా సంక్షేమమే తన అభిమతం అని ధ్వజారెడ్డి పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులు రామిరెడ్డి ధ్వజారెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆర్ వి రమణ, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, కృష్ణంరాజు, మైనార్టీ నాయకులు షఫీ, బత్తలమణి, ఆనాల చెంగల్ రెడ్డి, బత్తిన ఆనంద్, రామిరెడ్డి ఓబుల్ రెడ్డి తోపాటు వైసీపీకి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి.. డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త
రైల్వే కోడూరు మండలంలోని శాంతినగర్ శరవణ స్టోర్స్ వెనుక భాగంలో మేకల గొంతేరు నందు ఐదు రోజుల క్రితం ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి హుటాహుటన అక్కడికి చేరుకొని క్షుణ్ణంగా శవపరీక్ష పరిశీలించి వెంటనే పోలీస్ జాగిలాన్ని తెప్పించి హత్య లేక ఆత్మహత్య అన్న కోణంలో విచారణ చేపట్టారు. అయితే మృతుడి శరీర భాగం పూర్తి స్థాయిలో కుళ్ళిపోవడంతో అంతుచిక్కని పరిస్థితిగా తయారైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## చంద్రబాబు జన్మదిన వేడుకల భాగంగా ఆయుష్ హోమం

తిరుపతి,ఏప్రిల్ 19ప్రభాతవార్త:
తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకల భాగంగా ఆయుష్ హోమం, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ తెలియజేశారు. సోమవారం ఉదయం 9 గంటలకి ఎస్వీ యూనివర్సిటీ ప్రధాన వారం గోల్డెన్ ఆర్చ్ దగ్గర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

## చిత్తూరు నియోజకవర్గ నేషనల్ యాంటీ క్రైమ్ అండ్
### హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సమావేశం

చిత్తూరు హెల్త్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త;



చిత్తూరు ..హోటల్లో జరిగిన చిత్తూరు నియోజకవర్గ నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల ఉల్లంఘన మీద ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పించాలి, మనకు ఉన్నటువంటి హక్కులు ఏమిటి ,మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలి, అనే విషయముల పైన సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో సంస్థ నూతన ఆర్గనైజర్లుగా ఎస్ రాజేంద్ర బాబు, మేఘనాథన్, సర్దార్ వలీ ఖాన్ లను నియమించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ విజయ్ కుమార్ (న్యాయవాది), సి.కే రఘు రామమూర్తి, బి యువరాజ్ సింగ్, పాస్టర్. ఆర్ . జోబ్ మొదలగు వారు పాల్గొన్నారు. సంస్థలో నూతనముగా ఎంపికైన ఆర్గనైజర్లకు సంస్థ ఫౌండర్ మరియు అధ్యక్షులు డాక్టర్ జాన్ శామ్యూల్ కిమ్ అభినందనలు తెలియజేశారు.

## ఆర్టీసీ వైస్‌ఛైర్మన్‌చే బస్టాండ్ పరిశీలన

కుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త



ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ఆదివారం కుప్పం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండులో చేసపడుతున్న పారిశుద్ధ్య పనులపై తగు సూచనలు ఇచ్చారు. బస్టాండులో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం కంట్రోలర్ కార్యాలయంను పరిశీలించి నిర్ణీత వేళల్లో బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా సోమవారం స్త్రీ శక్తి, దివ్యాంగశక్తి పథకం అమలు చేసినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ కేక్ కటింగ్, ఇతర సేవా కార్యక్రమాలు నిర వ్హిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ ంగమ్మ గుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, కౌన్సిలర్ సోమశేఖర్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: డిఎస్పీ

కుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త




ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కుప్పం డిఎస్పీ పార్థసారథి సూచించారు. ఆదివారం స్థానిక ఎంఎఫ్‌సి జూనియర్ కాలేజ్‌లో క ంటి చికిత్సలు చేయించుకున్న సుమారు రెండు వ ందలమందికి సీనియర్ సిటిజన్ చట్టాల గురించి వివరించారు. అలాగే వృద్ధులు ఎదుర్కొనే సమస్యలు, పరిష్కార మార్గాల గురించి తెలిపారు. ఒంటరిగా ఉన్న సమయంలో తీసుకోవాల్సిన జా గ్రత్తల గురించి వివరించారు. ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబును అభినందించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, వైద్య సిబ్బంది గజే ంద్రకుమార్ వర్మ, రంజిత్‌కుమార్, మోసెస్, ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్‌బాబు పాల్గొన్నారు.

## నేడు దివ్యాంగులకు శ్రీవారి దర్శనం
### - టిటిడి బోర్డు సభ్యుడువైద్యం శాంతారాం



కుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా హైదరాబాద్ చుక్కల చారి టబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబుల సూచనల మేరకు కుప్పంకు చెందిన 108మందికి తిరుమల శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు టిటిడిబోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం తెలిపారు. 75మంది దివ్యాంగులు, వాలంటీర్లు 24మంది, 9మంది ఆర్గనైజర్లకు చుక్కల ట్రస్ట్ ఛైర్మన్ వేణు చుక్కల అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 6.30గంటలకు కుప్పం బస్టాండ్‌లో మొదల వుతుందన్నారు. ఇందుకు సహక రిస్తున్న టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, జెఇఒ వెంకయ్య చౌదరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో
## లారీ నుంచి కింద పడి డ్రైవర్ మృతి

పాకాల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త
పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పాకాల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి. చిన్న గోవింద్ తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కేవీ కుప్పం తాలూకా పాసుమత్తూరు హైదర్‌పురం గ్రామానికి చెందిన కే. సతీష్ (40) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18వ తేదీన సాయంత్రం సమయంలో లారీకి సెకండ్ డ్రైవర్‌గా జ్యూస్ లోడ్‌తో బీహార్‌కు బయలు దేరినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. లారీని ప్రధాన డ్రైవర్‌గా సౌందర్ రాజన్ నడుపుతున్నాడు. ప్రయాణ సమయంలో సతీష్ పలుచోట్ల మద్యం కొనుగోలు చేసి లారీలోనే సేవించినట్లు ప్రధాన డ్రైవర్ అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అనంతరం చిత్తూరు దాటి గాదంకి టోల్ ప్లాజా సమీపంలోని నేంద్రగుంట ఫ్లైఓవర్ వద్దకు చేరుకున్న సమయంలో, లారీ వేగంగా వెళ్తుండగా క్యాబిన్‌లో ఉన్న సతీష్ అసావధానంగా కిందపడిపోయాడు. ఆ సమయంలో హైవేపై వెళ్తున్న ఇతర వాహనాలు అతనిపై వెళ్లిపోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందినాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడి తమ్ముడు కే. బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాకాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. పీడబ్ల్యూఎస్ఐ నాగమంజుల కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## శ్రీ పెద్దపల్లి గంగమ్మ ఆలయంకు పోటెత్తిన భక్తులు
### - అమ్మవారికి విశేష పూజలు.. మహిళలచే పొంగళ్ల సమర్పణ !!



కుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త
స్థానిక కొత్తపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. ఉదయం అమ్మవారికి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని నోట్ల కట్టలతో అలంకరించారు. అమ్మవారి దర్శనంకు భక్తులు ఉదయం నుంచి రాత్రి దాకా పోటెత్తారు. ఆలయ సమీపంలో మహిళలు అమ్మవారికి పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టి సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్త శివకుమార్, కార్యదర్శి వెంకటేశులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. కాగా శనివారం రాత్రి అమ్మవారి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం జరిగింది. అమ్మవారికి ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పట్టువస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వి.కోట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త



మండలంలోని ఒగు గ్రామంలో జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకుప్పం మండలం పెద్ద బల్దారు గ్రామానికి చెందిన జి కృష్ణమూర్తి (47) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మృతుడు సొంత పనుల నిమిత్తం పెద్ద బల్దారు నుండి వి.కోటకు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వస్తుండగా తమిళనాడు రాష్ట్రం నుండి వి.కోట వైపు వస్తున్న మహేంద్ర థార్ వాహనం ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే కృష్ణమూర్తి అక్కడికక్కడే చనిపోయాడు.మృతుడికి భార్య ,ముగ్గురు పిల్లలు ఉన్నట్ట తెలిసింది.కారు డ్రైవర్ యొక్క నిర్లక్ష్యమే అతివేగ ప్రమాదానికి కారణమైనట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న వి.కోట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరుకు తరలించారు.

## క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలకు బహుమతులు

రామకుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త




మండలంలోని రాజుపేట వద్ద గ్రీన్ వ్యాలీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో నాలుగు టీంలు టోర్నీలో దిగిరాయి. చందు టీం విజేతగా నిలువగా, రన్నర్ ఆఫ్ శశి టీం బ్యాటింగ్ ఆడిన చందు టీం 7 ఓవర్లకు 75 పరుగులు చేయగా శశి టీం ఉత్కంఠ బరిలో 72 పరుగులు చేసింది. గెలుపొందిన చందు టీంకు గ్రీన్ వ్యా లీ పబ్లిక్ స్కూల్ తరపున 5 వేలు బహుమతిగా అందించారు.

## శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ

రామకుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త



మండల శివారులో నెలకొని ఉన్న వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయ నిర్వాహకులు మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే వేసవి కాలంలో మజ్జిగ పంపిణీని ఆదివారం ఆలయ నిర్వాహకులు సీతాపతి తెలిపారు. వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చే భక్తులు, వాహనదారులు, పాదచారులు మజ్జిగను స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పురోహితులు, చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...

గుడిపాల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త



మండలంలోని నరహరిపేట జడ్పీ ఉన్నత పాఠశాల నందు2001.. 2002 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకొని ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని విద్యా బోధనలు చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేశారు తాము చదివిన పాఠశాలకు 60 వేల రూపాయలు విలువచేసే టేబుల్స్ మరియు కుర్చీలను విరాళం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పదవ తరగతి స్నేహితులు దాదాపు 25 సంవత్సరాల తర్వాత నేడు ఒకటిగా కలుసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రస్తుత హెచ్ఎం దూర్వాసులు పూర్వపు ప్రధానోపాధ్యాయులు దొరస్వామి నాయుడు సిబ్బంది చిన్న తంబి భాస్కర్ రెడ్డి మధుసూదన్ శకుంతల రాజామణి అరుణమ్మ రాధమ్మ మరియు పూర్వపు విద్యార్థులు శరత్ బాబు కుమార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త



అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత ్తంగా ఉండాలని కుప్పం ఫైర్ అధికారి నేతాజీ కోరారు. ఆదివారం స్థానిక కెసి హాస్పిటల్, శిల్ప నర్సింగ్‌హోంలలో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలు, వైద్యులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. పలుచోట్ల వాల్‌పోస్టర్లను అతికించారు. కార్యక్రమంలో సిబ్బంది పురుషోత్తం, రామూర్తి, బాలాజీ, వెంకటేష్, రఘుపతి, విజయ్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# ఆరు నెలలుగా నిలిచిపోయిన ప్రమోషన్లు

## నాన్ టీచింగ్ సిబ్బంది ఆవేదన

తిరుపతి విద్య, ఏప్రిల్ 19 ప్రభాతవార్త



ఇంటర్మీడియట్ విద్యాశాఖలో నాన్ టీచింగ్ సిబ్బంది ప్రమోషన్లు ఆరు నెలలుగా నిలిచిపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. జోన్4 ఆర్జేడీ కడప కార్యాలయం నుంచి ప్రమోషన్ల ప్రక్రియలో ఆలస్యం జరుగుతుండటంతో సిబ్బంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయకులు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్‌ను రాష్ట్ర అధ్యక్షులు అవ్వారు శ్రీనివాసులు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రమణ, జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు పాల్గొన్నారు. రికార్డ్ అసిస్టెంట్ నుంచి జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు పోస్టులకు, అలాగే అటెండర్ నుంచి రికార్డ్ అసిస్టెంట్‌గా ప్రమోషన్లను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీ సిబ్బంది ప్రమోషన్లను కూడా చేపట్టాలని కోరారు. ఉద్యోగుల ఆవేదనను విన్న విద్యాసాగర్, ఈ సమస్యను ఇంటర్మీడియట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమోషన్లు ఆలస్యం కావడం వల్ల ఉద్యోగుల సేవా ప్రమాణాలు, పదోన్నతుల అవకాశాలు దెబ్బతింటున్నాయని అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. సమస్య త్వరగా పరిష్కారం కావాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# తిరుపతి డివిజన్

## స్నేహబంధము... ఎంత మధురం

### పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

రేణిగుంట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త



స్నేహబంధమూ ఎంత మధురము అంటూ పీఎం బోర్డింగ్ హౌస్ పూర్వ విద్యార్థులు ఆదివారం రేణిగుంట మండలం జీవాగ్గం పీఎం బోర్డింగ్ హౌస్‌లో కలుసుకున్నారు. తమ పూర్వ అనుభవాలను పంచుకుంటూ ఉదయం నుండి సాయంత్రం వరకు బాధలన్నీ మరిచిపోయి సంతోషంగా గడిపారు. తాము ఉండి చదువుకున్న చదువులమ్మ ఒడి మూతబడిపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కలసికట్టుగా ఉంటే కానిది ఏదీ లేదని బోర్డింగ్ హౌస్‌ను తిరిగి తెరిపించడానికి అందరూ సమిష్టిగా ముందుకు రావాలని ఒకరికొకరు పిలుపునిచ్చుకున్నారు. బోర్డింగ్ హౌస్‌లో ఉంటూ చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది చాలా ఉన్నత స్థితిలో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉదయ్ కుమార్, సీఐ రవి, కానిస్టేబుళ్లు సూరి దొరబాబు, మెడికల్ డిపార్ట్మెంట్ రాయలసీమ ఇంచార్జ్ భాస్కర్, యాంటీ కరప్షన్ విజిలెన్స్ కౌన్సిల్ సభ్యుడు శేఖర్ బాబు, విలేకరి రమేష్, నాదెండ్ల గోపి, కిరణ్, మోహన్, అల్లం రాజా, రఘు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు...

## మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం : డీఎస్పీ

సత్యవేడు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



సత్యవేడు మండలం బీసీ కాలనీ సమీపంలో గంజాయి నిర్మూలనపై శనివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పాల్గొన్నారు. సత్యవేడు వ్యాప్తంగా గంజాయి వినియోగం యువత భవిష్యత్‌ను తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. గంజాయి నిర్మూలన సత్యవేడుగా తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు. సత్యవేడు సర్కిల్‌పరిధిలో బీసీ కాలనీలో గంజాయి సంబంధించి కొంత మంది వ్యక్తులు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అందు వల్లే ఇక్కడ గంజాయిపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. బీసీ కాలనీచదువుకుంటున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు డీఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ మురళీనాయుడు, ఎస్ఐ సాయిచౌదరి, అడిషనల్ ఎస్ఐ లావణ్య, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్ నాయుడు, ప్రభాకర్, కోనయ్య, బాబు, పృథ్వీరాజ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల సంస్కృతిని చంద్రగిరికి తీసుకురావద్దు.!

### టిడిపి మాజీ మండల అధ్యక్షుడు కొట్టే నరశింహారెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



పులివెందుల సంస్కృతిని చంద్రగిరి నియోజకవర్గానికి తీసుకురావద్దని టిడిపి మాజీ మండల అధ్యక్షుడు కొట్టే నరశింహారెడ్డి వైసిపి మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబానికి సూచించారు. ఆదివారం రామచంద్రాపురంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెవిరెడ్డి అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడి ఎంఎల్ఏ పులివర్తి నాని అభివృద్ధి, సంక్షేమ పాలనకు పట్టం కట్టారని అన్నారు. సిఎంఆర్ కంపెనీ పేరిట తుడా నిధులు దోచుకుని ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చుచేసింది మీరు కాదా అని నిలదీశారు. గత ప్రభుత్వంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకుండా అరాచకాలు స ృష్టించి ఎంపిటిసి, జడ్పీటిసి, సర్పంచ్ పదవులను ఏకగ్రీవం చేసింది మీరుకాదా అంటూ దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్ సహకారంతో 22 నెలల్లో చంద్రగిరిని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. ఇకనైనా ఎంఎల్ఏపై అసత్య ఆరోపణలను మానుకుని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొట్టే చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు మునిరామిరెడ్డి, ఢిల్లీనాథ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, హరిప్రసాద్, రవికుమార్, రంజిత్‌కుమార్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్లు ధరించండయ్యా... బాబు

రేణిగుంట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త



హెల్మెట్లు పెట్టుకోండయ్యా బాబు, హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని గాజులమండ్యం ఎస్సై హరీష యువతకు పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి సూచనల తో గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయిల్ ఫ్యాక్టరీ (అత్తూరు క్రాస్) వద్ద ఎస్సై హరీష వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ పై అవగాహన కల్పించారు. రికార్డు లేని వాహనాలను నడపకూడదని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలలో ఇద్దరుకు మించి ఎక్కకూడదు అన్నారు. కార్లు నడిపేటప్పుడు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. ఆటోల్లో పరిస్థితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

## ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా ఎం.ఎం.శివప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక

సత్యవేడు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలో ముదిరాజ్ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎం.ఎం.శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక సాయిబాబా మందిరంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా కొనసాగిన పామాంజి మురళి(కోళ్ళ చిన్న) స్థానంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా శివప్రసాద్‌ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడిని సభ్యులు శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎం.ఎం.శివప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ సంఘం అభివృద్ధి, సామాజిక వర్గ అభ్యున్నతికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వరులు, హేమంత్, గురుప్రసాద్, రామారావు, మురళి, ముని ప్రతాప్, నాగరాజు, కుమార్, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి

### - అగ్నిమాపక అధికారి రాజయ్య

సత్యవేడు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకున్నప్పుడు వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలని సత్యవేడు అగ్నిమాపక కేంద్ర అధికారి రాజయ్య పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల, శ్రీ వెంకటేశ్వర ఆస్పత్రి ప్రాంగణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదాలు, విద్యుత్ షాక్‌లు సంభవించే అవకాశం ఉందన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగితే మంటలను అర్పటానికి ఎట్టి పరిస్థితుల్లోను నీటిని ఉపయోగించరాదన్నారు. కాలిపోతున్న వాసన లేదా పొగ వస్తే వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి విద్యుత్ సరఫరాను నిలిపి వేయాలని ఆయన సూచించారు. అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నివారించాలంటే ఓవర్ లోడింగ్ తగ్గించాలన్నారు. దీంతో పాటు పాతబడిన దెబ్బతిన్న వైర్లను వెంటనే మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇంట్లో నాణ్యమైన ఐఎస్ఐ మార్క్ ఉన్న వైర్లు, స్విచ్‌లను మాత్రమే వాడాలన్నారు. అనంతరం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఏర్పడే పొగను ఆర్పే విధానంపై డెమో నిర్వహించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య

పాకాల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త



పాకాల గ్రామంలోని కమ్మ వీధిలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పాకాల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి.చిన్న గోవింద్ తెలిపిన వివరాల మేరకు వై. వెంకన్న, తండ్రి ఎల్లయ్య, ప్రస్తుతం పాకాల ప్రాంతంలో కృష్ణారెడ్డి అనే వ్యక్తికి చెందిన ఇంటి పై అంతస్తులో నివసిస్తున్నాడు. గతంలో తిరుమలలో వంటమనిషిగా పనిచేసిన వెంకన్న, పరిచయస్తులతో కలిసి పాకాలకు వచ్చి ఇక్కడ మేస్త్రీ పనులు చేసేవాడు. అయితే గత రెండు నెలలుగా ఆయన బీపీ, షుగర్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పనులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నట్లు తెలిసింది. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో పాటు మానసిక ఆవేదనలో ఉండేవాడని స్థానికులు తెలిపారు. స్నేహితులు, పరిచయస్తులు ఆర్థికంగా సహాయం చేస్తూ వచ్చారని సమాచారం. ఆదివారం ఉదయం ఆయన మృతిచెందిన స్థితిలో కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై దిగువ అంతస్తులో నివసిస్తున్న అతని స్నేహితుడు రామానుజులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాకాల పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీ తరుణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## గ్రామ ప్రజలకు తాగునీటి బోరు మంజూరు

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



పుత్తూరు మున్సిపాలిటీ 5వ వార్డు పిళ్లారిపట్టు గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో కొత్తబోరు మంజూరు చేయించారు. ఆదివారం బోరు పనులకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఎమ్మెల్యే ఈ బోరు మంజూరు చేయించడం ఆయన దురదృష్టి, ప్రజాప్రయోజన దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకి పిళ్లారిపట్టు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ డి.ఎస్.గణేష్, బూత్ కమిటీ అధ్యక్షులు నాగరాజు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు ఏళుమలై రెడ్డి, వార్డు తెలుగు యువత అధ్యక్షులు చిదంబరం రెడ్డి, నాయకులు లక్ష్మీపతి, కుమార్, రమణతో పాటు స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సత్యవేడులో మే 13,14 తేదీల్లో గంగజాతర

సత్యవేడు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



సత్యవేడులో గంగజాతర మొదటి చాటింపు ఏప్రిల్ 29 మొదటి బుధవారం జాతర ఉత్సవాల తొలి ప్రకటన మొదటి సారింపు నిర్వహించాలని గ్రామ పెద్దలునిర్ణయించారు. రెండో చాటింపు మే 6వ తేదీ రెండో బుధవారం రెండవ చాటింపు నిర్వహించాలని తీర్మానించడం జరిగింది. గంగజాతర మే 13వ తేదీ మూడవ బుధవారం అత్యంత వైభవంగా వార్షిక గంగజాతర అమ్మవారి సత్యవేడు పట్టణ సరిహద్దుల్లో గ్రామ మహోత్సవం నిర్వహించబడుతుందన్నారు. గంగమిట్ట గెలుపు దర్శనం జాతర మరుసటి రోజు మే 14 గురువారం అమ్మవారి ప్రతిరూపాన్ని గంగమిట్ట వద్ద నిలుపు అనంతరం భక్తులకు మహా దర్శనభాగ్యం ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. గంగజాతర షెడ్యూల్ ప్రకారం జరిగేందుకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందడానికి గంగ జాతర చైర్మన్ వారికి పూర్తి అధికారాలు కల్పిస్తూ గ్రామ పెద్దలు సభ్యులు ఏకగ్రీవంగా అంగీకరిచండంతో గోపినాథ్‌రెడ్డి ఇప్పటి నుంచి గంగజాతర సంబంధించిన ప్రతి ఒక్క విషయాన్ని గ్రామ కమిటీ పెద్దలను కలుపుకుని పోతూ పూర్తి స్థాయిలో పనులు చేపట్టనున్నట్లు గోపినాథ్‌రెడ్డి మీడియాకు తెలిపారు.

## సుబ్రహ్మణ్యంనాయుడు మృతికి గాలి జగదీష్ నివాళి

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



పుత్తూరు మండలం కైలాసపురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంనాయుడు మృతికి గాలి జగదీష్ పూల మాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## గీతా మందిరంలో వార్షికోత్సవ వేడుకలు

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతా మందిరంలో 36వ సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో విఘ్నేశ్వర పూజ కలశ స్థాపన ప్రత్యేక పూజలు గీతాహోమం అఖండ గీతా పారాయణం నిర్వహించారు. మామిడాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. ఈ గీతాహోమం, శ్రీ వేదాంతం శ్రీనివాస భట్టాచార్యులు బృందం వారిచే నిర్వహించారు. సాయంత్రం పూజ శ్రీ పవిత్రానంద సరస్వతీసామిని చిన్నయ్య గీతాశ్రమం ఎలమండ్యం వారిచే ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. అనంతరం భక్తులు శ్రీకృష్ణ భగవానుడికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.


**CHITTOOR URBAN DEVELOPMENT AUTHORITY, CHITTOOR**

Roc.No:108/2022/CHUDA Dated :18-04-2026

**E-procurement Tender Notice**

Tenders are invited from eligibile contractors for **8 Nos.** works under **CHUDA Funds 2026-27** for worth of **116.00 Lakhs** through e-procurement by under signed.

| Sl.No | Bid down loading starting date and time | Last date & time for receipt of Bids |
|---|---|---|
| 1 to 8 | 21-04-2026 @ 6.00 PM | 06-05-2026 @ 4.00 PM |

Further details contact at **6301181167** during the office hours on all working days.

Sd/- Adharsh Rajeendran, I.A.S., Vice -Chairman, CHUDA


# నేడు జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:



జిల్లా కలెక్టరేట్ లో సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం మీడియాకు తెలిపారు. .అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.... ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్స్ అప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పరశురామేశ్వరుని కుంబాభిషేకం కలశ స్థాపనతో ప్రారంభం






ఏర్పేడు,ఏప్రిల్ 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయంలో కుంబాభిషేకం శోభ కలశ స్థాపనతో శ్రీకారం చుట్టారు. కలశాలను శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ అలయాధి కారులకు అందించారు. ఆదివారం ఉదయం నుంచి గుడిమల్లంలో కుంబాభిషేకం శోభ చోటు చేసుకుంది. గుడిమల్లం గ్రామాన్ని ఆలయ నిర్వాహాకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నిత్య కళ్యాణం పచ్చతోరణంలా మారింది. ఊరంతా మామిడి తోరణాలతో ముగ్గుల శోభతో శోభాయామానంగా తీర్చి దిద్దారు. పురాతనమైన ఆలయాన్ని కొత్త అందాలను పురావస్తుశాఖ తీర్చి దిద్దారు. ఎప్పుడు కుంబాభిషేకం జరిపారో ఏమో తెలియదు కానీ శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి పట్టుబట్టారు. గతానుభవం ఉన్న చైర్మెన్ బత్తల గిరినాయుడుకు పగ్గాలు అందించారు. ఆయనకు సహాకరించే ఇఓగా రామచంద్రారెడ్డి అభివృద్ధికి నో అని చెప్పకుండా పనులు చేపట్టారు. సుమారు రెండు నెలల నుంచి కుంబాభిషేకం పనులను చేపట్టారు. పురావస్తుశాఖ సుమారు రూ.30లక్షలకుపైగా వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. ఆలయానికి కొత్త శోభను చేకూర్చారు.ఐదు రోజుల పూజలకు సంబంధించి 60మంది రుత్వికులను ప్రత్యేకంగా రప్పించారు.

**శాస్త్రోక్తంగా ప్రారంభమైన పూజలు:**

గుడిమల్లంలో దశాబ్దాల తరువాత కుంబాభిషేకానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం ఉదయం గ్రామోత్సవం నిర్వహించిన తరువాత ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 8వేదికల మీద పూజలు ప్రారంభించారు. మంగళవాయిద్యాలు,దేవతానుజ్ఞ తరువాత మొదటి పూజలను వినాయ పూజలు జరిపారు. తరువాత ఆలయాన్ని శుద్ధి పుణ్యావాహచనం, గోపూజ షోడష గణపతి కలశారాధన నిర్వహించారు. సాయంత్రం మంగళ వాయిద్యాలతో కార్యక్రమాలు ప్రారంబించారు. వినాయ పూజలు, వినాయక పూజలు, శుద్ధి పుణ్యా వాహచనం, వాస్తు పూజలు, అష్టదిశపాలనపూజ, ప్రవేశ బలి, వాస్తుహోమం, పూర్ణాహుతి, దీపారాధనలు నిర్వహించారు.

**గ్రామోత్సవం:**

ఆదివారం ఆలయ కుంబాభిషేకం సందర్భంగా అభిషేకాలకు సంబంధించి ప్రధాన కలశాలను బొజ్జల బృందమ్మ సారథ్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు, వంశీకృష్ణ శర్మ, పవన్‌కుమార్‌శర్మలు వెంటరాగా చైర్మెన్ బత్తల గిరినాయుడు, ఆలయ కార్యనిర్వహాణధికారి రామచంద్రారెడ్డి గ్రామస్తులు వెంటరాగా కన్నుల పండువగా నిర్వహించారు. అతిథులకు ఆలయ ప్రదానార్చకులు వంశీకృష్ణశర్మ సారథ్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూజలు జరిపారు. పూజలకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమాల్లో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. దాంతో కుంబాభిషేకానికి శ్రీకారం చుట్టారు.













## విజన్-2047 లక్ష్యంగా పని చేద్దాం- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు విజన్ 2047 లక్ష్యంగా పెట్టుకొని నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకొని ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేద్దామని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన సమస్యలను



త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల నుండి 42 అర్జీలను సేకరించి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ మున్సిపల్ వ్యక్తిగత సమస్యల మీద అర్జీలు ఎక్కువ సంఖ్యలో వచ్చాయి. అధికారులు ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.













### ప్రేమించిన యువతికి

## పెళ్లి కావడంతో తీవ్ర మనస్తాపం యువకుడు ఆత్మహత్య

తిరుపతి,ఏప్రిల్ 19ప్రభాతవార్త: తిరుపతిలో విషాదం చోటుచేసుకుంది. ప్రేమించిన యువతికి మరొకరితో వివాహం జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకట రమణ లేఅవుట్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా గంగవరం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన జె. మహేంద్ర (20) తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. నగరంలోని వెంకటరమణ లేఅవుట్‌లో స్నేహితులతో కలిసి అద్దె గదిలో నివసిస్తున్నాడు. గత కొంతకాలంగా తాను ప్రేమించిన యువతికి వారం క్రితం వేరే వ్యక్తితో వివాహం జరగడంతో మహేంద్ర తీవ్ర మనస్థాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో తన బాబాయ్‌కి, సోదరికి మొబైల్‌లో మెసేజ్‌లు పంపాడు. నన్ను క్షమించండి.. అమ్మంటే నాకు చాలా ఇష్టం. ఆమెను బాగా చూసుకోండి అని ఆ సందేశంలో పేర్కొన్నాడు. ఆ తర్వాత తన గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ప్రాణాలు విడిచాడు. ఉదయం స్నేహితులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తిరుపతి వెస్ట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వైద్యకళాశాలకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వెస్టు పోలీసులు వెల్లడించారు.










## రాష్ట్ర దశ..దిశలను మార్చుతున్న సిఎం

- ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త : ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో దగా పడ్డ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దశ, దిశలను సిఎం చంద్రబాబునాయుడు మార్చుతున్నారని ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం బెంగళూరు టిడిపి ఫోరం అధ్వర్యంలో మారతహళ్లిలోని శ్రీకృష్ణ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన జయహో నాయకా కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సిఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను బిటిఎఫ్ అధ్వర్యంలో ఘన ంగా నిర్వహించడం పట్ల వారిని అభినందించారు. 2024 ఎన్నికల సందర్భంగా బెంగ ళూరు టిడిపిఫోరం విశేషంగా పనిచేశారని వారి సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర రాజధాని అమరావతి నగరాన్ని అద్భుత రీతిలో చరిత్రలో నిలిచిపోయేలా నిర్మించేందుకు కంకణబద్ధులై ఉన్నారన్నారు. సిఎం చంద్ర బాబు నాయుడు, మంత్రి లోకేష్‌ల విశేష కృషితో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నా యన్నారు. గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 20లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రమిస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధే ధ్యేయ ంగా ముందుకు సాగుతున్నారన్నారు. కూటమి ప్రభు త్వం అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాల గురించి బిటిఎఫ్ ప్రజలకు విస్తృతంగా వివరించాలన్నారు. ఈసందర్భంగా సిఇఒ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా సిఎం చంద్ర బాబు నాయుడును పేర్కొంటూ ఏర్పాటుచేసిన డాక్యుమెంటరీ అలరించింది. కార్యక్రమాల్లో బిటిఎఫ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.


















# పవన్ ఆరోగ్యం కోసం మృత్యుంజయ,చండీ హోమాలు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం జనసేన పార్టీ నాయకుడు,శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ సారథ్యంలో డెప్యూటి ముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపకులు కొణిదల పవన్‌కళ్యాణ ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యం కోసం, ప్రమాదాల్లో ఉన్నపుడు శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మృత్యుంజయస్వామి హోమాలను,జపాలను నిర్వహించారు.అలాగే త్వరగా కోలుకొని మళ్ళీ విధులకు సత్వరం హాజరు కావాలని కోరుతూ చండీహోమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కొట్టెసాయి ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ కోసం పాటు పడిన తమలాంటి వారిని గుర్తించి పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గుర్తింపు ఇస్తున్న నాయకుడు పవన్‌కళ్యాణ్ అన్నారు.రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని నిత్యం యోచిస్తూ కూటమిలో కీలకంగా వ్యవహరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి తెలుగుదేశం నాయకులు చంద్రబాబునాయుడుతో కలసి పని చేస్తూ ప్రజల సమస్యను ప్రభుత్వంలో చర్చించి పరిష్కరిస్తున్న నాయకుడు అన్నారు. నాటి నుంచి పార్టీ కోసం పాటుపడుతున్న వారందరికి పదవుల అవకాశంకల్పించిన నాయకుడు అన్నారు. అలాంటి నాయకుడు నేడు అస్వస్థతకు గురయ్యారరని ఆసుపత్రిలో చికిత్స పొందారని ఆయన త్వరగా కోలుకోవాలని ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని సన్నిధిలో నిర్వహించే మహిమాన్విత పూజలను నిర్వహించామన్నారు. ఆదిదంపతులనుమొక్కుకున్నామని వివరించారు.ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొట్టెసాయి ప్రసాద్‌తో పాటు కిరణ్‌రామిశెట్టి,,కుమార్,జయప్రకాష్, గరికపాటి చంద్ర, మాధవ్,మహేష్,ఈర్ల చిరంజీవి, డిల్లిబాబు, లీలాదర్, మెహన్ తేజ, జయరాం పాల్గోన్నారు.

## పవన్ ఆరోగ్యం కోసం జనసేననేతల పూజలు



తిరుపతి,ఏప్రిల్ 19ప్రభాతవార్త:

శస్త్రచికిత్స చేసుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని తిరుపతి లో ఆదివారం ఉదయం జనసేన ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ పూజలు చేయించారు. తిరుపతి బైరాగిపట్టెడలోని అభయఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పవన్‌కళ్యాణ్ పేరున అర్చనలు జరిపించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్ర అస్వస్థత కు గురై నిన్నటి రోజున ఆయనకి సర్జరీ చేయడం జరిగింది .ఆయన త్వరగా కోలుకోవాలని పవన్ కళ్యాణ్ ,మళ్ళీ ప్రజా సేవలో ఈ రాష్టానికే కాదు దేశ రాజకీయాలలో మరింత వేగంగా ప్రజా శ్రేయస్సు లో నిమగ్నం అవ్వాలని ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టినట్లు ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకేపాటి సుభాషిణి , హేమకుమార్,రుద్ర కిషోర్,ఆది, రాజేంద్ర, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## శక్తి టీం అవగాహన కార్యక్రమాలు

తిరుపతి,ఏప్రిల్ 19ప్రభాతవార్త:



ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్ ఆన్‌లైన్ మోసాలపై అవగాహన. సోషల్ మీడియా, ఫ్రాడ్ కాల్స్, అనుమానాస్పద లింక్స్‌పై జాగ్రత్తలు పిల్లల భద్రత, పోక్సో, బాల్య వివాహాలు, ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పించారు. తిరుపతి జిల్లా ఎస్పీ సి.ఎల్. సుబ్బ రాయుడు ఆదేశాల మేరకు మహిళా డిఎస్పి శ్రీలత ఆధ్వర్యంలో శక్తి టీం పోలీసులు నగరంలోని హాస్టల్స్, గ్రామాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, బాలికలు మరియు విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాలు చేపట్టారు . అత్యవసర సమయంలో ఉపయోగపడే టోల్ ఫ్రీ నంబర్లు 112, 1972, 1930, 8099999977 మరియు శక్తి యాప్ వినియోగంపై ప్రజలకు తెలియజేశారు.

## మాజీ మంత్రి రోజా కుమార్తెకు అత్యున్నత అవార్డు



పుత్తూరు రూరల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:

అమెరికాలోని బ్లూమింగ్ టన్ ఇండియానా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న మాజీమంత్రి రోజా కుమార్తె అన్షుమాలికకు ఆ యూనివర్సిటీ ఐదేళ్ళకు ఒక్క సారి ప్రెసిడెంట్ హెర్మన్ బీ వెల్స్ గౌరవార్థం అందించే ప్రతిష్టాత్మకమైన హెర్మన్ బీ వెల్స్ డిస్టింగ్విష్డ్ సీనియర్ అవార్డును అమెకు ప్రదానం చేసింది. అమెరికాలో ఈ అవార్డును అందుకున్న తొలి భారతీయ విద్యార్థి అన్షుమాలిక కావడం విశేషం. యూనివర్సిటీలో గౌరవ ప్రదర్శనగా ఉంచే బోర్డులో ఉత్తమ విద్యార్థిగా ఈమె పేరు లఖించిన బంగారు ఫలకం జీవితకాలం ఉండిపోతుంది. శనివారం ఈ అవార్డును తల్లిదండ్రులైన ఆర్.కె.రోజా, ఆర్.కె.సెల్వమణి సమక్షంలో ఆమెకు యూనివర్సిటీ ప్రదానం చేసింది. కుమార్తె అరుదైన అవార్డును సొంతం చేసుకోవడంతో మాజీమంత్రి రోజా ఆనందానికి అవదులు లేవు. కాగా అన్షుమాలిక ఇప్పటికే యూనివర్సిటీ ఔట్ స్టాండింగ్ లీడర్‌షిప్ అవార్డును అందుకోగా ది ఫ్లేమ్ ఇన్ మై హార్ట్ నవలను రచించి దక్షిణ భారతదేశంలో ఉత్తమ రచయిత్రి గుర్తింపు అందుకున్నారు. యువతకు ఆదర్శంగా నిలుస్తూ అంతర్జాతీయ వేదికపై తెలుగు ప్రతిష్టను చాటుతోంది. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## ప్రజా సేవ చేయడమే మా కుటుంబానికి ఆనందం

### - యువరాజు వి సర్వజ్ఞ కుమార యాంచేద్ర



వెంకటగిరి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త

ప్రజలకు సేవ చేయాలంటే మా కుటుంబానికి ఎంతో ఆనందంగా ఉంటుందని రాజ వంశస్థులు, యువరాజు వి సర్వజ్ఞ కుమార యాచేంద్ర తెలిపారు. వెంకటగిరి పట్టణంలో సర్వజ్ఞకుమార యాచేంద్ర సొంత నిధులతో చలివేంద్రాలను ఏర్పాటు చేసే ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే మా తాత వివిఆర్‌కే యాచేంద్ర కోరిక మేరకు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన చొక్కా కొనుక్కోవాలన్న ఆలోచిస్తారని సేవ చేసేందుకు ఎప్పుడు ముందుంటారని తెలిపారు. గ్రామాల నుంచి పట్టణానికి వచ్చిన వారు దాహంతో ఇబ్బంది పడకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వైసీపీ పట్టణ అధ్యక్షులు ఢిల్లీ బాబు, నాయకులు మధు నాయుడు, ఆవుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎం ఏ నారాయణ, కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జలకాలాటలలో...

### వేసవితాపం నుండి యువకులు పుష్కరిణిలో కేరింతలు

తిరుమల,ఏప్రిల్ 19ప్రభాతవార్తప్రతినిధి:



మండుతున్న వేసవితాపం నుండి కాస్త ఉపశమనం కోసం తిరుమల కొండపై యువకులు, భక్తులు పుష్కరిణిలో జలకా లాటలు ఆడుతున్నారు. స్నానాలచరిస్తూ సేదదీరుతున్నారు. తిరుమల స్థానిక యువకులు మధ్యాహ్నం వేళ పుష్కరిణిలో దూకుతూ ...విన్యాసాలు చేస్తూ స్నానాలతో ఎండవేడి నుండి ఉపశమనం పొందుతున్నారు. ఇలా భక్తులు కూడా యువకులతో జలకాలటల్లో ఆనందం చెందుతున్నారు.

## గిరిజన సాధికారత టిడిపి తోనే సాధ్యం..

### యం.సుబ్బయ్య, గిరిజన సలహా మండలి

శ్రీకాళహస్తి ఏప్రిల్ 19 ప్రభాతవా ర్త



అణగారిన వర్గాలను అన్ని రంగా లలో అభివృద్ధి పథం లోకి తేవా లన్న సమున్నత ఆశయంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ తోనే గిరిజన సాధికారత సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు యం. సుబ్బయ్య ఆదివారం పేర్కొన్నారు. నూతనంగా తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య తెలుగుదేశం పార్టీ గిరిజన విభాగం తిరుపతి పార్లమెంటు నాయకుడు 50 బూత్ కన్వీనర్ తుపాకుల ప్రసాద్ ఆధ్వర్యంలో జయరాంరావు వీధి లోని కొత్త కోనేరు యస్టీ కాలనీకి చెందిన గిరిజనులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, 18 వ వార్డు అధ్యక్షుడు షేక్ నూర్ మొహమ్మద్, గిరిజన విభాగం తిరుపతి పార్లమెంటు నాయకుడు తుపాకుల ప్రసాద్, తిరుపతి పార్లమెం టు నాయకుడు రమేష్, విశ్వనాథం, మునిరాజా, సుబ్బరత్న, మునెమ్మ, గంగా భవాని, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు .

## బాబోయ్ పందులు

శ్రీకాళహస్తి ఏప్రిల్ 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణం లో సంత మైదానం దగ్గర పందులు సంచారం ఎక్కువ ఉండడంతో ప్రజలు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పందులు చిన్న పిల్లల పైకి తిరగబడుతున్నాయని ఆవేదన చెందు తున్నారు. వీటివలన స్థానికంగా ఉండే నివాసస్తులు రోగాల బారిన పడుతున్నారని తక్షణ మే పందులు రాకుండా మున్సిపల్ శాఖ అధి కారులుచర్యలుతీసుకోవాలని ప్రజలస్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా వార్షికోత్సవ వేడుకలు




శ్రీకాళహస్తి ఏప్రిల్ 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో నూతనంగా శ్రీరాంనగర్ కాలనీలో ఆల్ఫా జెడ్ అను పాఠశాల ఈ ఏడాది ప్రారంభమైంది. ఈ పాఠశాల కరస్పాండెంట్ షేక్ జిలాన్ షరీఫ్ మొదటి సంవత్సర వార్షికోత్సవ వేడుకలను పట్టణానికి శివారు ప్రాంతమైన ఓ కళ్యాణ మండపంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల కోసం కోసం ఆటపాటలు, విందు ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు అంటే పిల్లలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు ఒక పెద్ద పండగ లాంటిదని సంవత్సరం పొడవునా తాము పడ్డ కష్టానికి సాధించిన విజయాలకు గుర్తుగా జరుపుకునే రోజన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కొత్త కార్యక్రమాలకు రూపుమాపారు. ఆయనతోపాటు పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ రుక్సానా బేగం, పాఠశాల గౌరవ సలహాదారులుగా పనిచేస్తున్న షేక్ మహబూ షరీఫ్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## కుప్పాల గిరిధర్ కుమార్‌కు జీవిత సాఫల్య పురస్కారం




తిరుపతి హెల్త్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

తిరుపతి సిటీ చాంబర్ ప్రతినిధులు, కెజికె వ్యవస్థా పకులు, బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా మహతి ఆడిటోరియంలో ఆదివారం జీవిత సాఫల్య పురస్కారంను అందించి ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహిత గిరిధర్ కుమార్ మాట్లాడుతూ తాను చేసిన సేవలను గుర్తించి తనకు సత్కారం చేసిన సిటీ చాంబర్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేసారు. తనకు ఈ పురస్కారం రావడం గర్వంగా ఉందన్నారు. కెజికె ఫౌండేషన్ నేతృత్వంలో కరోనా కష్టకాలంలో పేదలకు, ముఖ్యంగా ప్రైవేటు స్కూల్ టీచర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే మోహన్, గాంధి, పోకల అశోక్ కుమార్, అయూబ్ ఖాన్, స్వరాజ్యలక్ష్మి స్టాన్లీ, కరుణానిధి, చందన స్రవంతి, రజిని తదితరులు పాల్గొన్నారు.

## 15 ఇంటర్ తప్పిన విద్యార్థులకు గుడ్ న్యూస్...!

### సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఇంప్రూమెంట్ అవకాశం

### సబ్జెక్టులు తప్పిన విద్యార్థులూ ఇంప్రూమెంటు అర్హులే

తిరుపతి విద్య, ఏప్రిల్ 19 ప్రభాతవార్త

ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షల ఫలితాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ సువర్ణావకాశాన్ని కల్పించింది. దీంతో 2026 మార్చిలో జరిగిన పరీక్షలలో ఫస్ట్ ఇయర్లో, సెకండ్ ఇయర్లోనూ సబ్జెక్టులు తప్పిన విద్యార్థులకు ఇంప్రూమెంట్ పాసైన సబ్జెక్టులలో ఇంప్రూమెంట్ రాసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి పేపర్లో విద్యార్థులు సాధించిన మార్కులలలో ఉత్తమ మార్కులు పరిగణలోనికి తీసుకోనున్నారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు ఇంప్రూమెంట్ కోసం పరీక్ష ఫీజు రూ. 600లతో పాటు ప్రతి పాసైన సబ్జెక్టుకు రూ. 160లు చెల్లించాల్సి ఉంటుంది. సెకండ్, ఫస్ట్ ఇయర్ రెండింటికీ కలిపి పరీక్ష ఫీజు రూ.1200లతో పాటు ప్రతి ఇంప్రూమెంట్ సబ్జెక్టుకు రూ. 160లు చెల్లించాల్సి ఉంటుంది. మే నెల 21వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఈనెల 20వ తేదీ నుంచి 27లోపు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని అధికారులు తెలిపారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలకు స్వస్తి!



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త

అగ్నిప్రమాదాలకు సంబందించి అప్రమత్తంగా ఉంటే పెను ముప్పు ప్రమాదాల నుంచి బయటపడవచ్చునని ఆదివారం ఆసుపత్రి సిబ్బందికి ఇచ్చిన అవగాహన సదస్సులో అగ్నిమాపక దళాధికారి ఎన్.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తిలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఎస్ ఎస్ ఆసుపత్రిలో సిబ్బందికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రమాదం జరిగినపుడు ఎలా నడచుకోవాలనే అంశాన్ని ప్రయోగాత్మకంగా క్షేత్రస్థాయిలోప్రదర్శింపజేసారు. ఆసుపత్రి లోపల ప్రమాదం జరిగినపుడు రోగులను బయటకు ఎలా తీసుకురావాలి? ఎంత సమయం తీసుకోవాలి? అనే అంశాలకు సంబంధించి సిబ్బందికి అవగాహన కల్గించారు. అలాగే ఆసుపత్రిలో ఏర్పాటు చేసుకున్న అగ్నిమాపక పరికరాలను ఎప్పుడు? ఎక్కడ? ఎలా వాడాలి? అనే అంశాలకు సంబందించి వివరించారు. ఇక్కడకు ఇతర ఆసుపత్రుల నుంచి కకూడా సిబ్బందిని రప్పించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముందుజాగ్రత్త కరపత్రాలను అందించారు.

## గౌతులచ్చన్నకు నివాళులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త




గౌడ్ సంక్షేమ సంఘం సారథ్యంలో ఆదివారం శ్రీకాళహస్తిలోని ఆర్‌పిబియస్ జడ్‌పి హైస్కూల్ కూడలిలో సర్దార్ గౌతులక్షన్న విగ్రహానికి నివాళులర్పించారు.అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాలు చేసిన మహానీయుడు సర్దార్ గౌతు లక్షన్న అని వివరించారు.స్వాతంత్ర్య పోరాటాల్లో అనేక మార్లు జైలుకు వెళ్ళిన ఆయన కేంద్ర మంత్రిగా పని చేసారన్నారు.ఆయన విగ్రహంకు పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పేదలకు అన్నదానం జరిపారు. పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈకార్యక్రమాలకు గౌడ్ సంక్షేమ సంఘం లీగల్ అడ్వయిజర్ ఉదయగిరి మోహన్‌గౌడ్,మాజీ తిరుపతి గౌడ్ సంక్షేమ జిల్లా అధ్యక్షుడు తిరుకాల పురుషోత్తం గౌడ్, శ్రీకాళహస్తి నియోజకవర్గం గౌడ్ సంక్షేమ సంఘం చైర్మెన్ పర్వతాల చంద్రశేఖర్ గౌడ్,అధ్యక్షులు తిరుకాల అనంద్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జడబల్లి లోకేష్‌గౌడ్,అట్ల కృష్ణయ్యగౌడ్ మెస్ రవి గౌడ్, యూత్ అధ్యక్షుడు ఉదయ్‌గౌడ్,,అత్తిరాల నారాయణ గౌడ్, అనేం నాగేశ్వరరావు గౌడ్,సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పేటలో వైద్యశిబిరం: పేదలకు సహాయం



ఏర్పేడు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త

ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలోని మండల ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. తిరుపతిలోకి కీర్తి న్యూరో ఆసుపత్రి వారి సారథ్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసారు. ప్రస్తుతం చాలా మంది న్యూరో సమస్యలతో సతమతమౌతున్నందువల్ల ఉచిత వైద్యశిబిరం నిర్వహించుటకు తిరుపతిలోని కీర్తి న్యూరో ఆసుపత్రికి ధన్యవాదాలు తెలుపుతూ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 100 మందికి పైగా ఇక్కడ వైద్యపరీక్షలు జరుపుకున్నారు. ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఎఎస్ కీర్తి, డాక్టర్ హర్షితలు వైద్యపరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా బ్లడ్‌షుగర్ లెవల్ టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.డాక్టర్లకు పేటకు చెందిన అర్జున్‌బాబు వారి సహచరులు సహకరించారు.

## ఏకారమ్మ గ్రామోత్సవం

ఏర్పేడు,ఏప్రిల్ 19 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం గుడిమల్లం ఆలయంలో నిర్వహించే కుంబాభిషేకం విజయ వంతం కావాలని ఆదివారం గ్రామదేవత ఏకారమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఇక్కడ ఏ కార్యక్రమాలు చేపట్టాలన్నా గ్రామస్తులు మొదటి పూజలను గ్రామదేవత ఏకారమ్మకు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఆదివారం కకుంబాభిషేక పూజలు ప్రారంభించటానికి ముందు ఎకారమ్మ దేవతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించుటకు సారెను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తలగిరినాయుడు దంపతులతో పాటు ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి అర్చకులు,పూజలకు ప్రత్యేకంగా నియమించిన రుత్వికులతో గ్రామోత్సవం నిర్వహించి గ్రామదేవతకు పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించి ప్రత్యేకాలంకారాలు జరిపారు.ఈ గ్రామోత్సవంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నవయువక మండల్‌చే రక్తదాన శిబిరం

ఏర్పేడు ఏప్రిల్ 19 ప్రభాత వార్త



ఏర్పేడు మండలం కేంద్రంలో ఆదివారం యువ సమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ గానుగ పెంట రమేష్ రాష్ట్ర అధ్యక్షులు తాళిక్కాల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంస్థ 7 వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పేడు సంత మైదానంలో గవర్నమెంట్ రూయ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు సిబ్బంది వారి పర్యవేక్షణలో సంస్థ సభ్యుల సహకారంతో విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో ఏర్పేడు ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డి దాతలు, సంస్థ సభ్యులు స్వచ్చందంగా కార్యక్రమానికి హాజరు అయ్యి 33మందికి పైగా రక్తదానం చేశారు. సంస్థ ప్రతినిధులు గానుగ పెంట రమేష్, తాళిక్కాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డి వారికి స్వచ్చందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన ప్రతీ ఒక్క రక్త దానం చేసిన దాతలకు అలాగే తమవంతు సహాయ సహకారాలు అందించిన సేవా సంస్థ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్లడ్ బ్యాంకు రమేష్( కౌన్సిలర్ ) సిబ్బంది షీలా,ఫాపు, స్వాతి,శీను సంస్థ సభ్యులు శేషాద్రి,కిషోర్, నరేష్,వంశీ,వెంకటేష్, కిరణ్, ప్రకాష్, హరీష్,మురళీ వేణు,చెందు లు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి..

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త

రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని రైల్వే కోడూరు మరియు పెనగలూరు, చిట్వేలు, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలాలలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రత్యేకంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలపై విజయవాడలో మే 15న ప్రకాశం బ్యారేజీ నుండి గౌరవ విద్యా శాఖ మంత్రి ఇంటి వరకు జరిగే పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో సంబంధిత ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేసే సమాన పనికి సమాన హక్కుగా సాధించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ నాయకులు ప్రదీప్ మరియు మునికృష్ణలు పిలుపునిచ్చారు. మండల వారికి వ్యాక్సిన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నట్లు వారు ఈ సమావేశంలో తెలియజేశారు.

# స్వచ్ఛంద శ్రమదానాన్ని అడ్డుకున్న ఆర్‌పిఎఫ్

## ఆమరణ దీక్ష చేసైన రోడ్డు సాధిస్తాం : వామపక్ష నేతలు



శ్రమదానం చేస్తున్న నేతలను అడ్డుకుంటున్న ఆర్పిఎఫ్. సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసిల్దార్ శ్యాం ప్రసాద్

రేణిగుంట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త

రేణిగుంట పాత కడప రోడ్డు వద్ద ప్రత్యామ్నాయ మార్గం కోసం శ్రమదానం చేస్తున్న వామపక్ష, వైసిపి నేతలను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆదివారం అడ్డుకున్నారు. శ్రీకాళహస్తి తిరుపతి మార్గంలోని రేణిగుంట ముఖద్వారం పాత చెక్పోస్ట్ శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి ను మరమ్మతుల దృష్ట్యా రైల్వే అధికారులు మూసివేసిన విషయం అందరికీ తెలిసిందే. అప్పటినుండి రేణిగుంట పట్టణవాసులు వామపక్ష, వైసిపి నేతలతో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గం కోసం శాంతియుత ధర్నాలు నిరసనలతో రైల్వే అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. రైల్వే అండర్ బ్రిడ్జి మూసివేయడం వల్ల రేణిగుంట సంతగేటు, రాజరాజేశ్వరి దేవస్థానం నుండి రేణిగుంటకు వచ్చే రోడ్డు వద్ద విపరీతంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మధ్యాహ్నం మండుటెండలో కూడా ట్రాఫిక్ లో చిక్కుకున్న వాళ్లు బయటపడాలంటే సుమారు మూడు నుండి నాలుగు గంటల సమయం పడుతుంది. రేణిగుంట వాసులు పడుతున్న ఇక్కట్లను గుర్తించి వామపక్ష, వైసిపి నేతలు స్పందించి ప్రత్యామ్నాయ మార్గం కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. రైల్వే అధికారులు ఏమాత్రం కనికరించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నేతలు శాంతియుత మార్గంలో ఆదివారం ఉదయం స్వచ్ఛందంగా శ్రమదానం చేసి ఐదు కన్నుల (ఐదుకాణాల) బ్రిడ్జి కింద రోడ్డు వేసుకోవాలని ఉపక్రమించారు. విషయం తెలుసుకున్న ఆర్పిఎఫ్ పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆర్పిఎఫ్ సిబ్బందికి నేతలకు మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకున్నది. ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని నేతలు భీష్మించారు. రైల్వే ప్రొటెక్షన్ అధికారులు ఏమాత్రం కనికరించకుండా వారిని అక్కడనుండి పంపేశారు. నేతల అభ్యర్థుల మేరకు ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి పరిస్థితులను సమీక్షించాల్సిందిగా రేణిగుంట తహసిల్దార్ శ్యాం ప్రసాదును అక్కడకు పంపారు. తహసిల్దార్ శ్రమదానం చేస్తున్న నేతలతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చానని అధికారులకు నివేదికలు పంపి వారి ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు శ్రమదానం చేస్తున్న తాజా మాజీ సర్పంచ్ నాగేషం తిరుపతి ఎంపీ గురుమూర్తికి సెల్ఫోన్ ద్వారా జరుగుతున్న విషయాన్ని తెలిపారు. స్పందించిన ఆయన వెంటనే సమస్యను సవివరంగా టెక్స్ట్ చేయమని చెప్పారు. ప్రభాతవార్త ప్రతినిధి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డిని చరవాణిలో వివరణ కోరగా ఐదు కన్నుల(ఐదు కాణాల) బ్రిడ్జి పాత బడి పోయిందని అందువల్ల ఏదైనా వాహనం బ్రిడ్జిని ఢీకొంటే బ్రిడ్జిపై వెళ్లే రైళ్లకు ప్రమాదం వాటిల్లే అవకాశాలు ఉన్నందువల్ల రైల్వే అధికారులు సందేహిస్తున్నారని తెలిపారు. రేణిగుంట మండల ప్రజలు పడుతున్న అవస్థలు తెలుసని రైల్వే అధికారులతో చర్చిస్తామన్నారు. శ్రమదానంచేసిన వారిలో సిపిఎం నాయకులు వెంకటరమణ, కుప్పు స్వామి, చీరాలయ్య, మునుస్వామి, దస్తగిరి, హరినాథ్, సెల్వరాజ్, హేమనాథ్, సిపిఐ నేతలు వైయస్ మణి, కార్తీక్, సెల్వం, రసూల్, చంద్ర, భాను, పెంచలయ్య, వైసిపి రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, రేణిగుంట తాజా మాజీ సర్పంచ్ నాగేషం, వేణుగోపాలపురం లోహి, తాజా మాజీ వార్డ్ మెంబర్ రేణిగుంట పట్టణ యువనేత ఎంజిరెడ్డి, రేణిగుంట మండల పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## పవన్ కల్యాణ్ కోలుకోవాలని పూజలు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఆధ్వర్యంలో వేములపాటి అజయ్ బాబు సూచనలు మేరకు ఆదివారం శ్రీ చెంగాళమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన త్వరగా కోలుకొని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని సూళ్లూరుపేట శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారికి108 టెంకాయలు కొట్టి ప్రార్థించారు. శస్త్రచికిత్స నుండి త్వరగా కోలుకోవాలని, మునుపటి కన్నా రెట్టింపు ఉత్సాహంతో, నూతనోత్తేజంతో తిరిగి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టాలని మంది అభిమానులు, జనసైనికులు, ప్రజలు ఎదురు చూస్తున్నట్లు జనసేన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్ నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, సూళ్లూరుపేట జనసేన పార్టీ రాయలసీమ జోనల్ ప్రోగ్రాం కమిటీ షేక్ మాభాష, కయ్యాల కోటి యాదవ్, సుజాత, తడ మండలం సూర్య, గణపతి, సాయి, దొరవారిసత్రం మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, సుజాత కూటమి ప్రభుత్వ నాయకులు, ఏడుకొండలు, దాము, మునిరాజా, సూరి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైసిపి పూర్తి మద్దతు తెలిపింది

## నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

మహిళా బిల్లుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్లో పూర్తిగా మద్దతు తెలిపిందని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుపల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్ జే ఆర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో నిర్వహించారు. మా అధినాయకులు వైయస్ జగన్మోహన్ రెడ్డి 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కూడా అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపారు. మహిళలకు రిజర్వేషన్ను పార్లమెంట్లో ప్రతిపక్షాలు వ్యతిరేకించడం విచారకరమన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు కూడా ప్రవేశపెట్టలేకపోయారని తెలిపారు. వెంకటగిరి పట్టణంలో తెలుగుదేశం పార్టీ వారు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని విమర్శించారు. అతి విలువైన విశ్వదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాలను ఆక్రమించే ప్రయత్నాలు చేశారని తెలిపారు. వైసిపి అధికారాలకు వస్తుందని ఎవరు ప్రభుత్వ భూములు ఆక్రమించి వల్ల భవనాలు కట్టిన తొలగిస్తామని తెలిపారు. 9వ వార్డు ఉపాధ్యాయ నగర్లో ప్రాంతంలో వైసిపి పార్టీ వారికి చెందిన ఇళ్లను కక్షగట్టి కూల్చే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఒకసారి తొలగించారని మరలా తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అక్రమ కట్టడాలను కూల్చివేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ స్థలాల



ఆక్రమణాలను అధికారులు అడ్డుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, వైసిపి మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, వైసిపి పార్టీ కన్వీనర్లు ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కార్తీకరెడ్డి, మాజీ కౌన్సిలర్లు కళ్యాణి, పూజారి, ధనియాల రాదా, నాయకులు సతీష్, మురళీకృష్ణ, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

ధ్యానం చేయడం ద్వారా ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జ్ఞానదాత ఇందుమతి అన్నారు. ఆదివారం స్పిరిచువల్ టాబ్లెట్స్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని యశోద టవర్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో ధ్యానం చేస్తే దీంతో ఏకాగ్రత జ్ఞాపకశక్తి, బుద్ధి కుశలత, ఆత్మస్థైర్యం, మానసిక స్థిరత్వం, ప్రశాంతత చేకూరుతుందని ఆమె తెలిపారు. ధ్యానం సంపూర్ణ ఆరోగ్యానికి ఒక వరం లాంటిదని దీనిని క్రమం తప్పకుండా అలవర్చుకోవాలని ఆమె సూచించారు. అలాగే పిరమిడ్లో ధ్యానం చేస్తే మూడు రెట్లు అధిక శక్తి మన శరీరంలోకి వెళ్లి ఆ శక్తి ద్వారా తొందరగా స్వస్థత చేకూరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి.వి సుబ్బారావు తదితరు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని లయన్స్ క్లబ్ అఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు వి.సంగీత కుమారుడు హర్షాల్, సామర్థ్ పుట్టిన రోజు సందర్భంగా, వారి సహాయ సహకారాలతో ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా రీజియన్ సెక్రటరీలయన్ కె. ఆదిశేషారెడ్డి, ప్రెసిడెంట్ బి. లలిత, సెక్రటరీ అరుణ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇతర లయన్ సభ్యులు రఘురామి రెడ్డి, బివి అప్పారావు, మధుసూదన రెడ్డి, రాధాక్రిష్ణ రావు, పిజేసీ రెడ్డి, పి.యస్ జెట్టి, మురళీదర్, ఆర్ యంవి భాస్కర్ బాబు, వి వి శివకుమార్, చంద్ర శేఖర వంకా, రంగయ్య దాత కుటుంబ సభ్యులు సంగీత ప్రపుల్ల హర్షాల్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో అగ్నిమాపకదళ వారోత్సవాలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 19, ప్రభాతవార్త



సుళ్లూరుపేటలో అగ్నిమాపక దళ వారోత్సవాలను ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక జూనియర్ కళాశాల గ్రౌండ్స్ లో ఉదయం వాకింగ్ చేస్తున్న వారికి అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. వంటింట్లో గ్యాస్ సిలిండర్ లీక్ అయినప్పుడు దానిని ఏ విధంగా అదుపు చేయాలా ఆయన అంశంపై అవగాహన కల్పించారు.వంట పనులు పూర్తయిన వెంటనే రాత్రి వేళల్లో రెగ్యులేటర్ను కట్టివేయాలని తెలిపారు. శరీరానికి నిప్పు అంటుకున్నప్పుడు పరిగెత్తకుండా నేల మీద పడుకొని దొరలాలనిఅలాగే దుప్పటి కప్పాలని చెప్పారు.1944 సంవత్సరంలో బాంబేలో జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయిన 66 మంది అగ్నిమాపక దల సిబ్బందికినివాళి అర్పిస్తూ ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలను జాతీయ అగ్నిమాపదల వారోత్సవాల పేరుతో నిర్వహిస్తున్నారనిఅగ్ని మా పక దళఅధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తక్షణమే ఫైర్ స్టేషన్ కుసమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఆకుతో రమేష్, కే దయాకర్ రెడ్డి, ఎం కిషోర్, సెట్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మద్దతుతోనే ప్రభుత్వ స్థలాలు పరిరక్షణ

### - రౌండ్ టేబుల్ సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపాల్ బి కె ప్రసాద్



వెంకటగిరి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త

పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు దురాక్రమణకు గురవుతున్నాయని వీటిని ప్రజల మద్దతుతో రక్షించుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బికే ప్రసాద్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక ఆర్విఎం ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలకు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. విశ్వోదయ కళాశాల అనుభవంలోని సమితి బిల్డింగ్ ఉన్న స్థలాలు ప్రభుత్వానివేనన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు నివేదికలు ఇస్తే ప్రభుత్వం వీరిపై చర్యలు తీసుకోక తప్పదని గతంలో ఎన్నో అనుభవాలు ఉన్నాయన్నారు. బిజెపి నియోజకవర్గ మాజీ కన్వీనర్ తమటం మణి మాట్లాడుతూ త్రిభుని సెంటర్లో ఉన్న ప్రభుత్వ గయాళు భూమిని తప్పుడు పత్రాలతో ఇటీవలే కాజేశారని దీంతో భూ కబ్జాదారులు బరితెగించారన్నారు. వైసిపి నాయకులు చిట్టేటి హరికృష్ణ మాట్లాడుతూ అన్ని సెక్షన్ల మద్దతుతో భూకబ్జాలను అడ్డుకోవాలన్నారు. పోలేరమ్మ జాతరకు పార్కింగ్ స్థలాలుగా ఈ స్థలాలనే ఇప్పటివరకు వాడుకున్నామని ఇవి కబ్జాకు గురైతే భవిష్యత్తులో చాలా సమస్యలు ఉంటాయన్నారు. అమ్మవారిపేట, చెవిరెడ్డిపల్లి చెరువులు, కైవల్యా నది బఫర్ జోన్ ని,జిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడా ప్రాంగణాన్ని రక్షించుకోవాలన్నారు. వీధి పోరాటాలే కాకుండా న్యాయపోరాటం చేసైనా ఈ స్థలాలను కాపాడుకుంటామన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీగా ఏర్పడి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. ఈనెల 26న సాయంత్రం 6 గంటలకు ఆర్విఎం ఉన్నత పాఠశాలలో అన్ని సెక్షన్ల ప్రజానీకంతో చర్చా గోష్టి నిర్వహించాలని, 27న పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్థానిక తహసిల్దార్ కు వినతి పత్రం అందజేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం నాయకులు తోట కృష్ణయ్య, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య, జిల్లా నాయకులు జి.కృష్ణారెడ్డి, సిపిఐ నాయకులు జీవీ నరసింహులు, బీఎస్పీ నియోజకవర్గ నాయకులు జె వెంకటేశ్వర్లు, యువసేన నాయకులు సునీల్, ఐ ధనుంజయ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## తొలిచిత్రంతోనే సక్సెస్ కొట్టిన కుప్పం కుర్రాడు

### - దర్శకుడిగా హిట్ సాధించిన మునిరాజు..

### అలరిస్తున్న తిమ్మరాజుపల్లి టివి చిత్రం !!



కుప్పం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త

వెండితెరపై తమపేరు కనబడితే చాలు అనుకునే వేలాది మంది యువకుల్లా అతను అనుకోలేదు. తన శ్రమ,కష్టంతో పాటు ఎంతో నమ్మకం పెట్టుకున్న కథతో సినిమా తీసి తొలి చిత్రంతోనే సక్సెస్ కొట్టాడు ఓ కుప్పం కుర్రాడు. అతనే మునిరాజు. ఇతను దర్శకత్వం వహించిన తిమ్మరాజుపల్లి టివి చిత్రం ఈనెల 17న ప్రపంచ వ్యాప్తంగా విడుదలై హిట్ టాక్తో రన్ అవుతోంది. ప్రముఖ నటుడు కిరణ్ అబ్బవరం నిరా ్మతగా మారి ఈ చిత్రాన్ని నిర్మించి నిర్మాతగాను హిట్ అందుకున్నారు. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లి గ్రామంకు చెందిన మునిరాజు డిగ్రీ దాకా కుప్పంలోనే చదువుకున్నాడు. సినిమా రంగంపై ఇష్టంతో హైదరాబాద్ చేరారు. అక్కడ ఆన్లైన్ ఎడిటర్గా పనిచేస్తూనే సినిమా కథలు రాయడం మొదలుపెట్టారు. 1990 కాలంలో తొలిసారి టివి గ్రామాలకు వస్తే ఎలా ఉంటుంది అనే కథనంకు ప్రేమకథ, సస్పెన్స్ డ్రామాను జోడించి పూర్తి గ్రామీణ నేపథ్యంలో తిమ్మరాజుపల్లి టివి చిత్రకథను రాసుకున్నారు. ఈ కథ నటుడు కిరణ్ అబ్బవరంకు నచ్చి గ్రీన్సిగ్నల్ ఇచ్చారు. దీంతో మునిరాజు దర్శకత్వంలో రూపు దిద్దుకున్న ఈ చిత్రం ఇటీవల విడుదలై సక్సెస్ఫుల్గా నడుస్తోంది. కుప్పం పరిసర ప్రాంతాల్లో ఈ చిత్రం షూటింగ్ జరిగింది. మల్లప్పకొండ, కంగుంది దుర్గం, పరమసము ద్రం చెరువు, తిమ్మరాజుపల్లి గ్రామం తదితర చోట్ల చిత్రీకరణ చేశారు. ఈ స ందర్భంగా ఆదివారం డైరెక్టర్ తిమ్మరాజు 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో 350కుపైగా థియేటర్లలో ఈచిత్రం విడుదల చేయగా అని ్న చోట్ల సూపర్హిట్ టాక్ తెచ్చుకుందన్నారు. గ్రామీణ నేపథ్యం, సస్పెన్స్ డ్రామాకు ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఈ చిత్ర విజయం తనకు ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు. తనకు అవకాశం కల్పించిన నటుడు కిరణ్ అబ్బవరం, చిత్రబృందంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభాతవార్తకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

పెళ్లకూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త



కాయకష్టం చేసుకుని రూపాయికి రూపాయి కూడా పెట్టుకుని తమ పిల్లల భవిష్యత్తు బంగారు బాట వేసుకోవాలన్నా కుటుంబ యాజమాన్యాలు కళ విద్యుత్ సర్క్యూట్ రూపంలో బొగ్గు పాల య్యింది. వివరాల్లోకెళ్తే మండలం లోని నంది మాల గిరిజన కాలనీకి చెందిన సాగి.అనిల్ కుమార్, వరలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీలు వీరు కష్టించి పనిచేసి సంపాదించుకున్న డబ్బులతో పాటు, నగలు మరియు వస్తు సామాగ్రి, మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో విద్యుత్తు షాట్ సర్క్యూట్‌తో మంటలు ఒకసారి పెద్ద ఎత్తున వ్యాపించడంతో ఇంటి ఆవరణంలోనే ఉన్నా వరలక్ష్మి కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న స్థానికులు విద్యుత్తు నిలుపుదల చేసి మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలనుకున్న కుటుంబానికి అగ్ని రూపంలో రోదనను మిగిల్చింది. దీనితో ఆ నిరుపేద గిరిజన కుటుంబ సభ్యులు కుటుంబ భవిష్యత్తు కోసం నిర్మించుకున్న ఆశలు అగ్నిపాలవడంతో వారి ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా శంకర జయంతి వేడుకలు ప్రారంభం



వెంకటగిరి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

పట్టణంలోని కర్ణకమ వీధిలో ఉన్న శంకరమఠంలో ఘనంగా శంకర జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. శంకరా చార్యులకు రెండో రోజు గంధంతో ప్రత్యేకంగా అలంకరించారు. శంకరాచార్య జయించిన పురస్కరించుకొని ప్రత్యేక పూజ కార్యక్ర మాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజ నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

### - శోకసముద్రంలో కుటుంబ సభ్యులు

వెంకటగిరి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

మండలంలోని కలపాడు తెలుగు గంగ కాలవద్ద వేముల లీలా కుమార్ అనే యువకుడు మోటార్ బైక్ పై వస్తు అదుపుతప్పి పడి మృతి చెందాడు. పట్టణంలో లీలా కుమార్ ఎరువుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. లీలా కుమార్కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. లీలా కుమార్ శవానికి పోస్టుమార్టం నిర్వహించి ఎస్ఐ ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు మృతితో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగారు. అతివేగమే ప్రాణ వచ్చేసిందని పోలీసులు భావిస్తున్నారు.

## మత్స్యకారుల భరోసాకై అర్హుల పేర్లు నమోదు

వాకాడు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

మత్స్యకారుల వేట నిషేధ కాలంలో భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న మత్స్యకారుల భరోసా పథకం ద్వారా అధికారులు వేగవంతంగా ప్రక్రియ మొదలు పెట్టడం జరిగిందని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి జి. రఘు అన్నారు. శనివారం మండలంలోని మత్స్య శాఖ అభివృద్ధి అధికారి రఘు ఆధ్వర్యంలో తూపిలిపాలెం, కొండూరుపాలెం, తోటకట్ల కుప్పం, శ్రీనివాసపురం, పూడి కుప్పం (వాకాడు), రాయదొరువు, వడపాలెం, వెట్టికుప్పం, నవాబుపేట, తదితర గ్రామాలలో పర్యటించి మత్స్యకారుల బోట్లకు మత్స్యకారులకు భరోసా కల్పించేందుకు సుమారు 644 బోట్లకు గాను 3427 మంది మత్స్యకారులను గుర్తించామని ఇంకా ఎవరైనా ఉన్నావారు తమ దృష్టికి తీసుకొస్తే మత్స్యకారులకు భరోసా ఇప్పించేందుకు తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రఘు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

### - శోకసముద్రంలో కుటుంబ సభ్యులు

వెంకటగిరి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

మండలంలోని కలపాడు తెలుగు గంగ కాలవద్ద వేముల లీలా కుమార్ అనే యువకుడు మోటార్ బైక్ పై వస్తు అదుపుతప్పి పడి మృతి చెందాడు. పట్టణంలో లీలా కుమార్ ఎరువుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. లీలా కుమార్కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. లీలా కుమార్ శవానికి పోస్టుమార్టం నిర్వహించి ఎస్ఐ ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు మృతితో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగారు. అతివేగమే ప్రాణ వచ్చేసిందని పోలీసులు భావిస్తున్నారు.

# యదేచ్చగా అక్రమ గ్రానైట్ మైనింగ్ తవ్వకాలు

## చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చిన్నగొట్టిగల్లు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త

తిరుపతి చిన్నగొట్టిగల్లు-రొంపిచెర్ల సరిహద్దుల్లో గత కొన్ని రోజులుగా అక్రమంగా సాగుతున్న మైనింగ్ వ్యవహారం కలకలం రేపుతోంది. చిన్నగొట్టిగల్లు మండల రెవెన్యూ పరిధిలోని ఒక క్వారీలో అనుమతులు లేకుండా భారీ స్థాయిలో గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ అక్రమ మైనింగ్ పనులను రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. మైనింగ్ జరుగుతున్న ప్రదేశం నుంచే మీడియాతో మాట్లాడిన ఆయన సంచలన ఆరోపణలు చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అక్రమంగా గ్రానైట్ వ్యాపారం చేస్తున్నారని, టీడీపీకి చెందిన ఓ వ్యక్తిని ముందుంచి కోట్ల రూపాయల గ్రానైట్ను తరలిస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటివరకు సుమారు రూ.100 కోట్లు విలువైన గ్రానైట్ సరిహద్దులు దాటించారని, మరో రూ.70 కోట్ల మెటీరియల్ రవాణాకు



సిద్ధంగా ఉంచినట్లు అక్కడే నిల్వ ఉంచిన బండలను చూపిస్తూ వివరించారు. ప్రధానంగా మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ తవ్వకాలు జరుగుతున్నాయని, దొంగ వే బిల్లులతో గ్రానైట్ తరలింపు కొనసాగుతున్నా అధికారులు, పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తాను మీడియాతో కలిసి క్వారీకి వస్తున్నట్టు తెలుసుకున్న వెంటనే అక్కడి నుంచి యంత్రాలు, కార్మికులు, సంబంధిత వ్యక్తులు పరారయ్యారని తెలిపారు. ప్రభుత్వ పెద్దల సహకారంతోనే ఈ అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయని తీవ్రంగా ఆరోపించారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడం దారుణమని మండిపడ్డారు. వెంటనే అక్రమ మైనింగ్ పనులను ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేపడతామని తెలిపారు. అక్రమంగా గ్రానైట్ తరలించే లారీలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, ఎంపీపీ యుగంధర్ రెడ్డి, చిన్నగొట్టిగల్లు మండలం పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన్ మరియు స్థానికులు పాల్గొన్నారు.



మెటర్నిటీ సెలవు పై వెళ్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మోర్య కి జరిగిన వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్.

ప్రభాత వార్త , తిరుపతి కలెక్టరేట్,